క్లుప్తంగా

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు

తుని: పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగానికి అధికారులు చెక్ పెట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులపై నిఘా పెట్టామని, దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో భారీగా ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ప్లాస్టిక్‌కు బదులు క్లాత్ సంచులను వినియోగించాలని ఆయన కోరారు. ప్రస్తుతం వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నామని, మార్పు రాకపోతే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు మున్సిపల్ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు

గోకవరం: గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ తెలిపారు. గోకవరంలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. వర్షాల వలన ధాన్యం తడిసిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తడిసిన ధాన్యాన్ని పౌరసరఫరాశాఖ ద్వారా కొనుగోలు చేయడానికి నిర్ణయించారన్నారు. తడిసిన ధాన్యాన్ని మండలంలోని గుమ్మళ్లదొడ్డి, కోరుకొండ రైసు మిల్లులకు తరలించడానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. తడిచిన ధాన్యం ఉన్న రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, వీపీఏలకు తెలిపి ధాన్యం తరలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



గోకవరం ఆర్టీసీ ఉద్యోగికి సర్టిఫికెట్ అందిస్తున్న డీపీటీఓ షర్మిల

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలందిస్తూ తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్న పలువురికి సర్టిఫికేట్‌లు అందజేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఆర్టీసీ డీపీటీఓ షర్మిల ముఖ్యఅతిథిగా పాల్గొని 2022–23 సంవత్సరంలో అత్యధికంగా ఆయిల్ పొదుపు చేసిన 41 మంది ఉద్యోగులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ యు.రామన్న, సూపరింటెండెంట్ అప్పారావు, పలు యూనియన్ల నాయకులు ప్రగడ ప్రసాద్, మేడా మురళీశ్రీనివాస్, కొమరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన



రత్నగిరిపై కూచిపూడి నృత్యప్రదర్శన ఇస్తున్న హైదరాబాద్ కళాకారులు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా రత్నగిరి కల్యాణ వేదిక మీద బుధవారం రాత్రి హైదరాబాద్ కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారులు అలేఖ్య, మనస్విని, కీర్తన, హేమ లలిత, దేవి సుహాసిని, వివిధ భక్తి గీతాలకు అద్భుతంగా నృత్యం చేశారు. కళాకారులు, వారి గురువు ఎ.సంజీవబాబులను దేవస్థానం అధికారులు సత్యదేవుని చిత్రపటాలు, స్వామివారి ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

జగ్గంపేట: కాకినాడ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జగ్గంపేట జాతీయరహదారిపై బ్లాక్ స్పాట్స్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై అతివేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అనంతరం జగ్గంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఏలేశ్వరం అంబేడ్కర్ నగర్‌లో నీట మునిగిన సచివాలయం



ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇలా..



కొంతంగిలో తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న ఏడీ గాంధీ

వీడని వాన

- వరుసగా మూడోరోజు భారీ వర్షాలు
- నీట మునిగిన పల్లపు ప్రాంతాలు
- ఆందోళన చెందుతున్న రైతులు

ఏలేశ్వరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా మూడోరోజు బుధవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ వర్షం పడుతూనే ఉంది. అకాల వర్షాలకు పల్లపు జలమయమయ్యాయి. నియోజకవర్గంలో ఈ ఏడాది సుమారు 22 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. ఇప్పటికే దాదాపు 85 శాతం కోతలు పూర్తికాగా మిగిలిన కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. పలు ప్రాంతాల్లో కోసి పనలపై ఉన్న వరిపంట తడిసిపోయింది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యవసాయాధికారులు భరోసా ఇస్తున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ముంపులోనే..

స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని సచివాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ ఇంకా ముంపులో ఉన్నాయి. వర్షాలకు ప్రధాన రహదారులు నీట మునిగాయి. గ్రామీణ ప్రాంతాలతో పాటు ఏలేశ్వరం పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపునీరు పోయే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చైతన్యనగర్, లింగవరం కాలనీ, రాజమండ్రి కాలనీ తదితర కాలనీల్లో వర్షపునీరు రోడ్లపైనే నిలిచిపోయింది. అధికారులు వర్షపునీరు పోయే మార్గం చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

శంఖవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని కొంతంగిలో పనలపై వర్షానికి తడిసిన వరి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరికోతలు వాయిదా వేసుకోవాలన్నారు. తడిసిన వరి పనలను గట్లపై వేసుకోవాలన్నారు. నూర్చిన ధాన్యం మొలక రాకుండా క్వింటా ధాన్యంలో కిలో ఉప్పు, 20 కిలోల పొడిఊక కలపాలన్నారు. అరటి, మామిడి, జీడిమామిడి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



వెదురుపాకలో తడిసిన మొక్కజొన్న పంట

భారీ వర్షం

గోకవరం: మండల వ్యాపంగా బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మరోపక్క భారీ వర్షానికి కళ్లాల్లోని మొక్కజొన్న, ధాన్యం తడిసిపోయాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలవ్యాప్తంగా బుధవారం వర్షం కురిసింది. ఈదురుగాలులకు మామిడి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం ప్రభావంతో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు పంట ఒబ్బిడి పనుల్లో బిజీగా ఉన్నారు.

స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితుల సేవలు శ్లాఘనీయం



సత్యనారాయణ, వేంకట రమణలను సన్మానిస్తున్న వ్రతపురోహిత సంఘం సభ్యులు

అన్నవరం: రత్నగిరి దేవస్థానం వ్రతవిభాగంలో స్పెషల్ గ్రేడ్ వ్రతపురోహితులు కల్యాణబ్రహ్మ ముత్య సత్యనారాయణ, ప్రయాగ వేంకటరమణ సేవలు మర్చిపోలేమని వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు నాగాభట్ల రవిశర్మ అన్నారు. గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన ముత్య సత్యనారాయణ, ప్రయాగ వేంకటరమణ దంపతులను బుధవారం సాయంత్రం రత్నగిరిపై ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పురోహితులు వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితులు మంధా రాంబాబు, పెండ్యాల రమణ, ప్రయాగ అంజిబాబు, నాగాభట్ల వీరభద్రం, పురోహిత సంఘం కార్యదర్శి చిట్టెం పవన్, కోశాధికారి ఆకొండి కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బహూకరణ

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెం గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు తదేకం ఫౌండేషన్, గ్రామానికి చెందిన శ్రీరామ సేవా సంఘం సంయుక్తంగా వాటర్ ట్యాంకర్‌ను సమకూర్చారు. గ్రామస్తుల సౌకర్యార్థం రూ.1.50 లక్షలతో వాటర్ ట్యాంకర్‌ను అందచేసినట్టు శ్రీరామా సేవా సంఘం సభ్యులు తెలిపారు.

సామూహిక అత్యాచారం అవాస్తవం

డీఎస్పీ మురళీమోహన్

తుని రూరల్: కోటనందూరు బస్టాండు సమీప మార్కెట్ షెడ్డులో గుర్తు తెలియని యువతిపై సామూహిక అత్యాచారం అవాస్తవమని దిశా డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో తప్పుడు వార్త ప్రచురించడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని ఆయన ఖండించారు. రూరల్ సీఐ సన్యాసిరావు, కోటనందూరు, తుని రూరల్ ఎస్సైలతో కలసి డీఎస్పీ మురళీమోహన్ తుని రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకర్లతో మాట్లాడారు. పత్రికలో ప్రచురించినట్టు, పెనుముచ్చు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో వైరల్ చేసినట్టు యువతిపై అత్యాచారం జరగలేదని తమ విచారణలో స్పష్టమయ్యిందన్నారు. మార్కెట్ షెడ్డులో పడుకుని ఉన్న మహిళ మద్యం తాగి ఉందన్నారు. తనకు వివాహమైందని, భర్త చనిపోయి 12 సంవత్సరాలు అయ్యిందని ఆ మహిళ తెలిపిందన్నారు. 15 ఏళ్ల వయస్సు గల కుమార్తె ఉందని, ఆమెను చూడడానికి కోటనందూరుకు ఆర్టీసీ బస్‌లో వెళుతూ గత నెల 27న మద్యం మత్తులో మార్కెట్ షెడ్డులో పడుకున్నట్టు ఆమె చెప్పిందన్నారు. ఈ క్రమంలో పడుకున్న మహిళ దుస్తులు చెదిరిపోవడంతో స్థానికుల్లో ఒకరు సర్దినట్టు తెలిసిందన్నారు. తనపై ఎవరూ అత్యాచారం చేయలేదని, తన మాన మర్యాదలకు భంగం కలిగించి అప్రతిష్టపాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరిందన్నారు. దీనిపై కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ వివరించారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తుని రూరల్, కోటనందూరు ఎస్సైలు ఎ.బాలాజీ, స్వామినాయుడు పాల్గొన్నారు.



తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న దిశా డీఎస్పీ మురళీమోహన్

సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

గోకవరం: మండలంలోని కామరాజుపేట పంచాయతీ శివరామపట్నంలో పేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్ డిమాండ్ చేశారు. మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామరాజుపేట పంచాయతీ పరిధిలో 36 ఎకరాల సీలింగ్ భూమిని దాదాపు 25 సంవత్సరాలుగా సుమారు 76 మంది పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూములపై సాగుదారులకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వ రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోకా పెద్ద, టి.అర్జున్, ఆర్.అప్పలరాజు, ఎం.సూరిబాబు, కామరాజు, నాగచక్రం తదితరులు పాల్గొన్నారు.



శివరామపట్నంలో జెండాను ఎగురవేస్తున్న రైతు కూలీ సంఘం నాయకుడు సురేష్

విద్యుత్ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన

తుని రూరల్: జగనన్న కాలనీ వాసులతో పాటు గ్రామీణులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. ఎస్.అన్నవరం, తుని పట్టణ పేదలకు నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో ఏర్పాటు చేయనున్న రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లకు రాజుపేట శివారులో ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్) టీవీఎస్ఎన్ మూర్తితో కలసి ఎంపీపీ రాము శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. జగనన్న కాలనీల్లో భారీ సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిన్నింటికీ అంతరాయం లేకుండా నాణ్యతగల విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఒక్కొక్క సబ్ స్టేషన్‌ను రూ.3.50 కోట్లతో నిర్మిస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎస్ఈ మూర్తి తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి నాణ్యతగల విద్యుత్‌ను వినియోగదారులకు అందిస్తామన్నారు. సర్పంచ్ బుద్దాల సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు లంక కృపానందం, దుంగల నాగేశ్వరరావు, గింజాల పొట్టిబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



రాజుపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాము, అధికారులు

కాట్రావులపల్లి గ్రామాభివృద్ధికి కృషి

నెక్కంటి సీఫుడ్స్ మేనేజర్ గోపిచంద్

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని అన్నివిధాలా తమ సంస్థ ద్వారా అభివృద్ధి చేస్తామని నెక్కంటి సీఫుడ్స్ అడ్మిన్ మేనేజర్ గోపిచంద్ తెలిపారు. కాట్రావులపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం రూ.15 లక్షలతో నిర్మించే విశ్రాంతి భవనానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో కాట్రావులపల్లి ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్లు అవసరమని అడిగిన వెంటనే మంజూరు చేశామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విశ్రాంతి భవనం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టా సుగణరావు, ఉపసర్పంచ్ సూరిమిల్లి రాంబాబు, ఆసుపత్రి డాక్టర్లు రాజశేఖర్, విజయ్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.



కాట్రావులపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో విశ్రాంతి భవనానికి శంకుస్థాపన చేస్తున్న గోపిచంద్

సత్యదేవుని నమూనా ఆలయానికి రంగులు



కొత్త హంగులతో సత్యదేవుని నమూనా ఆలయం

అన్నవరం: జాతీయ రహదారిపై గల సత్యదేవుని నమూనా ఆలయం కొత్త రంగులు, హంగులతో దర్శనమిస్తోంది. ఈ ఆలయం గోడలు, గోపురం రంగులు వెలసిపోయి ఉండేవి. కాకినాడ జేఎన్‌టీయూకేకు చెందిన ప్రొఫెసర్ ఎల్.సుమలత ఈ నమూనా ఆలయానికి, సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల ఉత్సవ మూర్తులకు రంగులు వేయించడంతో ఆలయం మరింత ఆకర్షణీయంగా మారింది.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గోకవరం: గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన సూర్యబాలాజీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. సనాతన ధర్మ ప్రబోధన సమితి ఆధ్వర్యంలో స్థలదాత అక్షింతల రాజా, రాణి దంపతులు పీఠలపై కూర్చొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు మాట్లాడుతూ లోక కల్యాణార్థం గ్రామంలో సూర్యదేవాలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, దాసరి తమ్మన్నదొర, సుంకర వీరబాబు, గాజింగం సత్తిబాబు, దాసరి చిన్నబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, మంగరౌతు రాము తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్థలదాత అక్షింతల రాజా, రాణి దంపతులు

టిప్పర్ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

తొండంగి: మండలంలోని రావికంపాడులో టిప్పర్ లారీలను మంగళవారం అర్ధరాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. మెట్ట ప్రాంతం క్వారీల నుంచి గ్రావెల ఇతర మెటీరియల్ తరలిస్తున్న లారీలు కత్తిపూడి, రావికంపాడు, ఏవీ నగరం, పెరుమాళ్లపురం గ్రామాల మీదుగా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ ఫిషింగ్ హార్బర్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. లారీల రాకపోకల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. హెవీ లోడ్ వాహనాలు కావడంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయని, వంతెనలు కుంగిపోయాయని గ్రామస్తులు వివరించారు.

ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా కలిసి లారీల రాకపోకలను నిలిపి వేసి ఆందోళన నిర్వహించారు. లారీల కాంట్రాక్టర్ స్పందించి ప్రమాదాల నివారణకు, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. తొండంగి పోలీసులకు సమాచారం అందడంతో అక్కడకు చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

కోటనందూరు: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని పాతకొట్టాంలో ఏర్పాటు చేసిన నూతన పీహెచ్‌సీని బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటికే కోటనందూరులో పీహెచ్‌సీ ఉండగా కొత్తగా మరో పీహెచ్‌సీని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే సీఎం జగన్ సంకల్పమన్నారు. దీనిలో భాగంగానే ప్రతి మండలానికి కనీసం రెండు పీహెచ్‌సీలను ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించారన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లోవ దేవస్థానం మాజీ చైర్మన్లు బొంగు ఉమారావు, లాలం బాబ్జీ, సర్పంచ్ పసగడుగుల వరహాలు, ఉపసర్పంచ్ బొంగు గోపాలకృష్ణ, ఎంపీటీసీ దొగ్గా రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పీవీ నరసింహారావు, తోలెం రాజులు, పలక సత్యనారాయణ, కోరుమిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పాతకొట్టాంలో పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

ధాన్యం కొనుగోలుపై అవగాహన

కిర్లంపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో రైసు మిల్లర్లు, వీఆర్వోలు, వీపీఏలకు ధాన్యం కొనుగోలుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి జోకా అమృత, తహసీల్దార్ వెంకట మాధవరావు, ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, మండల సివిల్ సప్లై అధికారి సుగుణ ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధివిధానాలను వివరించారు. అకాల వర్షాలకు తడిసి రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల అధైర్య పడొద్దని సూచించారు.

వంద రోజులు పని కల్పించాలి

కిర్లంపూడి: ఉపాధి కూలీలందరికీ వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీఓ బి.సతీష్‌బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ బి.చిరంజీవిరావు అధ్యక్షతన మండల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలన్నారు. అలాగే ప్రతి ఉపాధి కూలీకి సరాసరి రూ.272 వేతనం వచ్చేలా పనిచేయించాలని సూచించారు. టెక్నికల్ జేఈ కుమారి పాల్గొన్నారు.

త్వరలో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం

కిర్లంపూడి: గ్రామంలో నిర్మిస్తున్న నూతన పోలీస్ స్టేషన్‌ను త్వరలో ప్రారంభిస్తామని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పక్కన నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. పోలీస్ స్టేషన్‌లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని జగ్గంపేట సీఐ సూర్యఅప్పారావుకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విధుల నిర్వహిస్తున్న పోలీస్ స్టేషన్ శిథిల వ్యవస్థకు చేరుకుందన్నారు. రూ.65 లక్షల సీఎస్ఆర్ నిధులతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని జనవరిలో ప్రారంభించామని, ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మరో 45 రోజుల్లో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను విజిట్ చేశారు. అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో నూతన పోలీస్ స్టేషన్ పనులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్